వాకిళ్ల నిండుగా.. పూలపండగ



నేరేడుచర్ల: విజయదుర్గ ఆలయం వద్ద..



సూర్యాపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద నృత్యాలు చేస్తున్న మహిళలు



సూర్యాపేటలో బతుకమ్మతో యువతి

ఈనాడు
సూర్యాపేట
గురువారం అక్టోబరు 3, 2024

పారిశుద్ధ్యాన్ని కాపాడుదాం.. వ్యాధులను పారదోలుదాం




హుజూర్‌నగర్‌లో ప్రదర్శన నిర్వహిస్తున్న కళాకారులు, పురపాలక సిబ్బంది, పాలకవర్గం

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: పారిశుద్ధ్యాన్ని కాపాడుదాం.. వ్యాధులను పారదోలుదాం.. ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొడదాం అంటూ ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కళాకారులతో పురపాలక సంఘం ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తూ ప్రదర్శన నిర్వహించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణ కళాకారులు బుధవారం వివిధ రకాల వేషధారణతో ప్రదర్శనలో పాల్గొనగా, ఓ కళాకారుడు వేసిన ప్లాస్టిక్ భూతం వేషధారణ అందరినీ ఆకట్టుకునేలా సాగింది.

గండంలో.. యువ మూత్రపిండం

కట్టంగూరు మండలానికి చెందిన మమత (21) డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. తండ్రి అడ్డా కూలీ. తల్లి ఓ ప్రైవేటు వసతిగృహంలో పనిచేస్తుంది. ఏడాది క్రితం ఆరోగ్యం బాగాలేక ఆసుపత్రికి వెళ్తే రెండు కిడ్నీలు చెడిపోయాయని వైద్యులు వెల్లడించారు. కొవిడ్ రెండు సార్లు కరోనా సోకడంతో వైద్యులను సంప్రదించకుండానే విచ్చలవిడిగా మందుల వాడకంతోనే ఆమె రెండు కిడ్నీలు చెడిపోయాయని ప్రాథమికంగా నిర్ధారించారు. ఆమె ఏడాది నుంచి నల్గొండ కేంద్రంలో డయాలసిస్ చేయించుకుంటోంది.



ఈనాడు, నల్గొండ: ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా కొవిడ్ అనంతరం కిడ్నీ బాధితుల్లో ఎక్కువగా 18 ఏళ్ల నుంచి 25 ఏళ్ల వారు ఉండటం ఆందోళన కలిగించే పరిణామమే. నల్గొండ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)లో గత కొంత కాలం నుంచి డయాలసిస్ కేంద్రానికి యువత ఎక్కువగా వస్తుండటం గమనార్హం. గత రెండేళ్లలో సుమారు 35 మంది ఒక్క నల్గొండ జీజీహెచ్‌లోనే చికిత్స తీసుకుంటుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. సూర్యాపేటలోనూ క్రమంగా చిన్న వయసువారికి డయాలసిస్ చికిత్సలు పెరిగాయని సంబంధిత వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 20 ఏళ్లలోపు వారు పది మందికి పైగా చికిత్సకు వస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ డయాలసిస్ కేంద్రాల్లో చికిత్స తీసుకుంటున్న వారిని కలుపుకొంటే ఈ సంఖ్య మరింతగా ఉంది. విచ్చలవిడిగా డ్రగ్ వాడకంతో పాటు కిడ్నీ సమస్యలను సరైన సమయంలో గుర్తించక పోవడంతోనే ఈ పరిణామాలు సంభవిస్తున్నట్లు వైద్యులు అభిప్రాయపడుతున్నారు. విచ్చలవిడి మందుల (యాంటీ బయాటిక్స్)తోనే ఎక్కువగా కిడ్నీ రోగాలు వస్తున్నాయని చెబుతున్నారు. అవగాహన లోపంతోనూ చిన్న వయసువారిలో కిడ్నీలు ఫెయిల్ అవుతున్నాయని నల్గొండ ఏరియా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ మాతృనాయక్ 'ఈనాడు'కు వెల్లడించారు.

నకిరేకల్ మండలానికి చెందిన శిరీష (24)కు చిన్న వయసులోనే పెళ్లయింది. ఇద్దరు కూతుళ్లు. ప్రసవ సమయంలో ఎక్కువ డోస్ కలిగిన మందుల వాడకంతో ఆమె రెండు కిడ్నీలు చెడిపోయాయి. సరైన సమయంలో స్పందించి ఉంటే ఆమెకు ఈ పరిస్థితి వచ్చేది కాదని ఆమె కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేదరికం అనుభవిస్తున్న ఆమె ఇద్దరు కూతుళ్లు ఆపన్న హస్తాల కోసం ఎదురుచూస్తున్నారు. వీరితో పాటూ నల్గొండకు చెందిన 24 ఏళ్ల ఉమర్ ఫరూఖ్, 18 ఏళ్ల మరో యువకుడిదీ ఇదే పరిస్థితి.

ఒక్క వైద్యుడుంటే ఒట్టు..!

ఉమ్మడి జిల్లాలో నల్గొండతో పాటూ మిర్యాలగూడ, సూర్యాపేట, భువనగిరి, హుజూర్‌నగర్, కోదాడ, చౌటుప్పల్, దేవరకొండ, నాగార్జునసాగర్, ఆలేరుల్లో 55 పడకల డయాలసిస్ కేంద్రాలున్నాయి. నిత్యం 472 మందికి రక్తశుద్ధి నిర్వహిస్తున్నారు. ఏ కేంద్రాల్లోనూ మూత్రపిండాల వైద్యులు (నెఫ్రాలజీ) లేరు. దీంతో టెక్నీషియన్స్‌తోనే ఈ కేంద్రాలను నడిపిస్తున్నారు. మరోవైపు అన్ని డయాలసిస్ కేంద్రాలకు బాధితులు ఏటేటా పెరుగుతున్నారు. అందుకు తగ్గ సౌకర్యాలు ఈ కేంద్రాల్లో లేకపోవడంతో హైదరాబాద్‌లోని పలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.



నల్గొండ డయాలసిస్ కేంద్రంలో చికిత్స తీసుకుంటున్న బాధితులు

❑ గతేడాది 5,855 మంది ఆరోగ్యశ్రీ కింద డయాలసిస్ చికిత్స తీసుకుంటే, ఈ ఏడాది తొలి 7 నెలల్లోనే 3,890 మంది చికిత్స పొందడం గమనార్హం. ఈ సంఖ్య ఏడాది ఆఖరుకు 6 వేలకు చేరుతుందని వైద్యులు వెల్లడిస్తున్నారు.

ఉపకార వేతనాల నమోదుకు నూతన విధానం

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరానికి ఎస్సీ విద్యార్థుల పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల నమోదుకు సంబంధించి నూతన విధివిధానాలు కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ-పాస్ సైట్ నమోదులో మార్పు చేశారు. అర్హులైన ప్రతి విద్యార్థి పదో తరగతి మెమోలో ఉన్న వివరాలు ఆధార్‌లో కూడా ఉండాలి. విద్యార్థి కుటుంబ ఆదాయ పరిమితి రూ.2 లక్షల నుంచి రూ.2.50 లక్షల వరకు పెంచినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి లత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ-పాస్ నమోదు ప్రక్రియలో మొదటి దశలో విద్యార్థి పదో తరగతి, ఆధార్ వివరాలు సరిపోలిన తరువాత మాత్రమే తాత్కాలిక 12 అంకెల ఐడీ ఇస్తారని చెప్పారు. రెండింట్లో వేర్వేరుగా ఉన్నట్లయితే మీసేవ కేంద్రంలో సరి చేసుకోవాలని సూచించారు. రెండో దశలో ఐడీ నెంబర్‌తో మీసేవ కేంద్రంలో బయోమెట్రిక్ వేయాల్సి ఉందన్నారు. మూడో దశలో ఇంటర్‌నెట్ నమోదు ప్రక్రియను పూర్తి చేసి సంబంధిత ధ్రువపత్రాలు జత చేసి కళాశాలలో సమర్పించాలని తెలిపారు.

మట్టపల్లిలో దివ్యమూర్తులకు పవిత్రారోపణం

మఠంపల్లి, న్యూస్‌టుడే: మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహుని క్షేత్రంలో నిర్వహిస్తోన్న పవిత్రోత్సవాలలో బుధవారం అష్టోత్తర శతకలశ ఆరాధనలు నిర్వహించాక ఆవాహన చేసిన పవిత్రాలను దివ్యమూర్తులకు ఆరోపణం చేశారు. రాజ్యలక్ష్మి, చెంచులక్ష్మీ సమేత స్వయంభువునికి, ద్వార, క్షేత్ర పాలకులకు, ఆలయ ప్రాకారాది గోపుర శిఖరాలకు మంత్రయుక్తంగా పవిత్రారోపణం కావించారు. ఉదయం సుగంధ ద్రవ్యాలు, వివిధ దాతువులు, నదీజలాలతో నింపిన 108 కలశాలలోని తీర్థంతో స్నపన చేపట్టారు. సాయంత్రం స్తంభోద్భవుడు సతీసమేతుడై గరుడ వాహనంపై తిరువీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చాడు. రాత్రి యాగ మండపంలో జరిగిన మహాశాంతి హోమంతో మూడోరోజు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ముగిశాయి. గురువారం సప్తదశ కుంభారోపణం, పూర్ణాహుతి, శాంతికల్యాణంతో పవిత్రోత్సవాలు పరిసమాప్తమవుతాయి. ధర్మకర్తలు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్, యాజ్ఞికుడు వాసుదేవాచార్యులు, అర్చకులు పద్మనాభాచార్యులు, బ్రహ్మాచార్యులు, శ్రీనివాసాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు పాల్గొన్నారు.



మట్టపల్లి: శ్రీస్వామి సన్నిధిలో శతకలశ ఆరాధన నిర్వహిస్తోన్న యాజ్ఞికులు

అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిన మహనీయుడు



సూర్యాపేట: గాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: అహింసా, సత్యాగ్రహం గాంధీ ఆయుధాలని, వాటి ద్వారానే స్వాతంత్ర్యం సిద్ధించేలా పోరాటం చేశారని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పేర్కొన్నారు. మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా బుధవారం పట్టణంలోని గాంధీ విగ్రహానికి, అనంతరం కలెక్టరేట్‌లో చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. భారత దేశానికి అంతర్జాతీయంగా గుర్తింపు తెచ్చిన మహనీయుడు మహాత్మాగాంధీ అని కొనియాడారు.

★ అదనపు కలెక్టర్ బీఎస్.లత, జడ్పీ సీఈవో అప్పారావు, డీఎంహెచ్‌వో కోటాచలం, డీటీడీవో శంకర్, డీఈవో అశోక్, షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి లత, డీడబ్ల్యూవో నర్సింహారావు, డీపీవో నారాయణరెడ్డి, రాజేశ్వర్‌రావు, గోపి, సత్యనారాయణ పాల్గొన్నారు.

సన్మార్గంలో జీవించటమే బాపూ మార్గం



ఖైదీలనుద్దేశించి ప్రసంగిస్తున్న న్యాయమూర్తి శ్రీవాణి

సూర్యాపేట న్యాయవిభాగం, న్యూస్‌టుడే: హింస, నేర ప్రవృత్తి విడనాడి సన్మార్గంలో జీవించటమే గాంధీజీ మనకు నేర్పిన జీవిత పాఠమని సూర్యాపేట జిల్లా న్యాయసేవాధికార సభ్య కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులతో కలిసి స్థానిక ఉప కారాగారాన్ని సందర్శించిన న్యాయమూర్తి శ్రీవాణి తొలుత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. విచక్షణ మరచి నేరాలకు పాల్పడి జైలు పాలు కావటం వల్ల సమాజంలో గౌరవం కోల్పోవటంతో పాటు కుటుంబం విచ్ఛిన్నం అవుతుందని న్యాయమూర్తి అన్నారు. జూనియర్ సివిల్ జడ్జిలు కె.సురేష్, జె.ప్రశాంతి, న్యాయవాద సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నూకల సుదర్శన్‌రెడ్డి, మల్లయ్య, వి.సత్యనారాయణ పిళ్లే, బి.వెంకటరత్నం, వాణి, బి.సుధాకర్‌రెడ్డి, షేక్ ఖలీల్ పాల్గొన్నారు.

పేట మార్కెట్‌కు పాతధాన్యం కళ

భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు రైతులు ఇన్నాళ్లు దాచుకున్న ధాన్యాన్ని తీసుకొస్తున్నారు. కొందరు రైతులు గత యాసంగిలో పండించిన వరి పంటను నూర్పిడి చేసిన వెంటనే ఇళ్లల్లో నిల్వ చేసుకున్నారు. ప్రస్తుతం మార్కెట్‌కు వందల బస్తాలు తెస్తున్నారు. ఇందులో బీపీటీ, జైశ్రీరాం, హెచ్‌ఎంటీ రకాలే ఎక్కువగా ఉంటున్నాయి. సూర్యాపేట మార్కెట్ రాష్ట్రంలోనే రెండో అతిపెద్దది. ఇక్కడికి సూర్యాపేట నియోజకవర్గంతోపాటు తుంగతుర్తి, కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాల నుంచి రైతులు తమ పంట ఉత్పత్తులు తీసుకొస్తుంటారు. సీజన్‌లోనే కాకుండా నిరంతరం క్రయవిక్రయాలు సాగుతాయి. ప్రస్తుతం మార్కెట్‌కు అన్నదాతలు రోజూ సుమారు 2500 వరకు వివిధ రకాల ధాన్యం బస్తాలు తీసుకొస్తున్నారు. ఇవి సన్నాలు కావడంతో ఎక్కువగా వంటకు వినియోగిస్తుంటారు. దీంతో ఖరీదుదారులు కూడా ధర కూడా అధికంగా పెట్టి కొనుగోలు చేస్తున్నారు.



సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో వడ్ల రాసులు

రోజూ 'పేట' మార్కెట్‌కు వస్తున్న ధాన్యం బస్తాల వివరాలు

రకం	బస్తాల సంఖ్య	క్వింటాకు గరిష్ఠ ధర(రూ.లలో)
బీపీటీ	864	3188
జైశ్రీరాం	1458	3351
హెచ్‌ఎంటీ	293	3019

సన్నాలకు డిమాండ్ ఉంది



– ఆర్.సంతోష్ కుమార్, మార్కెట్ కార్యదర్శి, సూర్యాపేట

మార్కెట్ రోజూ 2500 బస్తాల వడ్లు వస్తున్నాయి. అన్నీ సన్నాలు కావడంతో డిమాండ్ బాగా ఉంది. ఖరీదుదారులు ధాన్యం నాణ్యతగా ఉండటంతో ధర ఎక్కువగా పెడుతున్నారు. రైతులు నాణ్యమైన పంట ఉత్పత్తులు తీసుకురావాలి.

గాంధీజీ గర్వపడేలా.. పల్లెలు మారెనిలా..!



గట్టికల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్థులు

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: మద్యపానం వల్ల కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఆందోళన చెంది గాంధీ జయంతి సందర్భంగా ఆత్మకూర్(ఎస్) మండలం గట్టికల్, పాతర్లపహాడ్ గ్రామాల ప్రజలు బుధవారం మద్య నిషేధం వైపు అడుగులు వేశారు. గ్రామాలలో మద్యం తాగవద్దు, విక్రయించవద్దని ప్రతిజ్ఞ చేశారు. గట్టికల్‌లో అఖిలపక్షాలతో పాటు మహిళ, యువజన, కుల సంఘాలు, రాజకీయ పార్టీల అనుబంధ సంఘాలు పాల్గొన్నాయి. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. దసరా ముగిసిన మరుసటి రోజు నుంచి గ్రామంలో గొలుసు దుకాణాలు, గుట్కాలు, పాన్‌మసాలాలు పూర్తిగా బంద్ చేయాలని తీర్మానం చేశారు. ఉల్లంఘించిన వారికి రూ.25వేల వరకు జరిమానా విధిస్తామన్నారు. ఎస్ఐ వై.సైదులు మాట్లాడుతూ గ్రామస్థుల తీర్మానాన్ని అభినందిస్తున్నట్లు, చట్టపరంగా సహకారం అందిస్తామన్నారు.

★ పాతర్లపహాడ్‌లో గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలతో నివాళి అర్పించిన గ్రామస్థులు గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో మద్యపాన నిషేధం విధిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేసుకున్నారు. ఈనెల 6 నుంచి నిషేధం అమల్లోకి వస్తుందని మద్యపాన నిషేధ కమిటీ తెలిపింది. గ్రామంలో మద్యాన్ని అమ్మినా, తాగినట్లు రుజువైనా మొదటిసారి రూ.20వేలు, మళ్లీ ఉల్లంఘిస్తే రూ.50వేల వరకు జరిమానా విధిస్తామని కమిటీ ఛైర్మన్ దొంతగాని కర్ణాకర్ వెల్లడించారు.



పాతర్లపహాడ్‌లో.. సమావేశమైన అఖిలపక్షాలు

పులిచింతల డ్యాం పైకి మొసలి



చింతలపాలెం, న్యూస్‌టుడే: పులిచింతల డ్యాంపై మొసలి ప్రత్యక్షమైంది. మంగళవారం రాత్రి డ్యాంపై నుంచి పల్నాడు జిల్లా వైపునకు వెళ్తున్న వాహనదారులు దీన్ని చూసి కొద్దిసేపు వెనకే వెళ్లారు. కొద్దిసేపటి తర్వాత అది జలాశయంలోకి వెళ్లింది. ఇటీవల గుడిమల్కాపురం వాగులోనూ మొసలి స్థానికులకు కన్పించింది. నిరుడు కూడా వజినేపల్లి సమీపంలోని కల్వర్టుపై మృతిచెందిన మొసలి కన్పించింది. ఇటీవల భారీ వర్షాలు, వరదలొస్తున్న నేపథ్యంలో ఆ వరదల్లోనే ఈ మొసళ్లు వచ్చి ఉండొచ్చంటున్నారు. ప్రస్తుతం పులిచింతల జలాశయంలో పూర్తి స్థాయిలో నీటి నిల్వలు ఉండటంతో జలాశయంలో ఉన్న మొసళ్లు రోడ్ల పైకి వస్తుండొచ్చని పేర్కొంటున్నారు. జలాశయ పరిసర ప్రాంతాల్లో మొసళ్లు సంచరిస్తున్న నేపథ్యంలో పర్యాటకులు జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

గంటపాటు దంచి..పత్తిని ముంచి

◆ జిల్లాలో 166.8 మి.మీ వర్షపాతం నమోదు



సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా సుమారు గంటపాటు భారీ వర్షం కురిసింది. రెండు రోజులుగా విపరీతమైన ఉష్ణోగ్రతలు నమోదు కాగా.. బుధవారం ఉరుములు, మెరుపులతో కూడిన వానపడింది. గత నెలలో దాదాపు భారీ వర్షాలు కురిశాయి. జన జీవనానికి, పాడి పంటలకూ భారీ నష్టం చేకూరింది. వానలు ముగిశాయనుకున్న తరుణంలో అక్టోబరు నెలలో రెండో రోజునే వర్షం దంచికొట్టింది. సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ, నడిగూడెం, ఆత్మకూర్(ఎస్), మద్దిరాల, తిరుమలగిరిలో వర్షం కారణంగా విద్యుత్తు అంతరాయం కలిగింది. పలుచోట్ల రహదారులపై నుంచి వర్షం నీరు ప్రవహించింది.

★ జిల్లాలో అత్యధికంగా సుమారు 4 లక్షల ఎకరాల్లో వరి సాగు చేపట్టగా.. ఈ వర్షాల కారణంగా మడుల్లో నీరు నిలిచి చీడపీడల బెడద ఎక్కువయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం వరి ఈనె దశలో ఉంది. వర్షాల కారణంగా పంటకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. సుమారు 70 వేల ఎకరాల్లో చేపట్టిన పత్తికి నష్టం జరుగుతోంది. గతంలో కురిసిన వర్షాలకు పంట ఏపుగా పెరిగింది. ప్రస్తుతం పత్తి కాయలతో పాటు, రెండోసారి పత్తి తీత కూడా మొదలైంది. పంట చేతికొచ్చే దశలో నష్టం వాటిల్లడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నమోదు ఇలా.. జిల్లా వ్యాప్తంగా 166.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలోని 23 మండలాల్లో పది మండలాల వరకు వర్షం కురిసింది. అత్యధికంగా తిరుమలగిరిలో, అత్యల్పంగా మోతె మండలంలో వాన పడింది. తిరుమలగిరి 58.0, సూర్యాపేట 30.8, నడిగూడెం 29.8, నాగారం 12.3, మద్దిరాల 10.7, ఆత్మకూర్(ఎస్) 10.3, చివ్వెంల 5.6, నూతనకల్ 5.0, జాజిరెడ్డిగూడెం 2.5, మోతె 1.8 మి.మీ వర్షపాతం నమోదైంది.

సహాయం అందిస్తేనే.. సర్వే ముందుకు



డిజిటల్ పంట సర్వే చేయలేమంటూ ఇటీవల నల్గొండ జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న ఏఈవోలు

నాంపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న డిజిటల్ పంట సర్వేకు ఆదిలోనే అడ్డంకులు ఎదురవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సర్వే బాధ్యతలను వ్యవసాయ విస్తరణాధికారులకు (ఏఈవో) ప్రభుత్వం అప్పగించింది. ఈ మేరకు శిక్షణ ఇచ్చి యాప్‌లను ఏఈవోలకు అందించింది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మంగళవారం సర్వే ప్రారంభించాల్సి ఉండగా.. పని ఒత్తిడి, సిబ్బంది కొరత వంటి కారణాలతో సర్వే చేయలేమంటూ ఏఈవోలు చేతులెత్తేస్తున్నారు. వ్యవసాయ శాఖలోని 49 రకాల పనులు చేస్తూనే.. డిజిటల్ సర్వే నిర్వహించటం అసాధ్యం అంటున్నారు. పంటల సాగు విస్తీర్ణాన్ని బట్టి తమకు సహాయక సిబ్బందిని నియమిస్తే సర్వే చేస్తామని చెబుతున్నారు.

ఎందుకీ పంట సర్వే..?

భవిష్యత్తులో దేశవ్యాప్తంగా ఆహార భద్రత, పంటల బీమాతో పాటు ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగే పంట నష్టాన్ని అంచనా వేయడం, ఆహార ధాన్యాల ఎగుమతి, పంటల కొనుగోలు, సాగు ప్రణాళిక, మార్కెటింగ్ తదితరాలకు డిజిటల్ పంట సర్వే ముఖ్య భూమిక పోషించనుంది. ఇందులో భాగంగా వ్యవసాయరంగంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(డీపీఐ)ని రూపొందించే లక్ష్యంతో 'డిజిటల్ అగ్రి మిషన్' పథకాన్ని కేంద్రం తీసుకొచ్చింది. దీని అమలుకు రూ.2,817 కోట్లు వెచ్చిస్తోంది. రైతులకు ప్రయోజనం చేకూర్చడానికి, వ్యవసాయ సామర్థ్యాన్ని పెంచడానికి ఆధునిక సాంకేతికతను వినియోగించనుంది. రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహించేందుకు సంకల్పించింది.

ఇతర రాష్ట్రాల్లో ఇదీ పరిస్థితి..

ఆంధ్రప్రదేశ్‌లో 1,000-1,500 ఎకరాల వరకు ఒక గ్రామ వ్యవసాయ సహాయకుడిని అక్కడి ప్రభుత్వం నియమించింది. గ్రామ స్థాయిలో వివిధ వ్యవసాయ సర్వేలు, ప్రభుత్వ పథకాల అమలులో లబ్ధిదారులైన రైతులను గుర్తించటం, ధ్రువపత్రాల సేకరణ, రైతు సమావేశాల వంటి విధులు నిర్వర్తించడంతో ఏఈవోల సేవలు అన్నదాతలకు మరింత చేరువయ్యాయి.

❑ మహారాష్ట్ర, ఒడిశాలలో టెండరు ప్రక్రియ ద్వారా ప్రైవేటు కంపెనీలకు డిజిటల్ పంట సర్వే బాధ్యతలు అప్పగించారు. కర్ణాటకలో ఒప్పంద ప్రాతిపదికన సిబ్బందిని నియమించి సర్వే చేయిస్తున్నారు. తమిళనాడులో వ్యవసాయ విద్యనభ్యసించిన వారిని రోజువారీ వేతనంతో పని చేయించుకుంటున్నారు.

❑ కేంద్ర ప్రభుత్వ సూచనల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం గ్రామ వ్యవసాయ సహాయకులను నియమిస్తే సర్వే చేయడానికి సిద్ధమని ఏఈవోల సంఘం రాష్ట్ర, జిల్లాల నాయకులు చెబుతున్నారు.

సిబ్బంది కొరతే ప్రధాన సమస్య..

నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో 314 మంది ఏఈవోలు పనిచేస్తున్నారు. వీరి పరిధిలో సుమారు 23.6 లక్షల ఎకరాల సాగు భూమి ఉంది. ప్రతి 5 వేల ఎకరాలకు ఒకరు చొప్పున 472 మంది ఏఈవోలు అవసరం. ఉమ్మడి జిల్లాలోని 60 శాతం క్లస్టర్లలో సాగు భూమి 5 వేల ఎకరాలకు మించి ఉంది. నాంపల్లి మండలంలోని నాలుగు క్లస్టర్ల పరిధిలోని ఒక్కో ఏఈవో పరిధిలో 9 వేల ఎకరాలకు మించి సాగు భూమి ఉండటం గమనార్హం. డిజిటల్ సర్వేలో భాగంగా సదరు ఏఈవోలు తమ పరిధిలోని అన్ని పంటపొలాల్లోని సర్వే నంబర్లలోకి వెళ్లి వివరాలను ఆన్‌లైన్లో పొందుపరచాల్సి ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో సాగు భూమి, ఏఈవోల వివరాలు

సాగు భూమి (ఎకరాలు లక్షల్లో)	జిల్లా	ఏఈవోలు
12	నల్గొండ	140
6.90	సూర్యాపేట	92
4.70	యాదాద్రి	82

ఊరూవాడా.. ఉయ్యాలపాట..!


యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ సన్నిధిలో బతుకమ్మ వేడుక


సూర్యాపేట సద్దుల చెరువు వద్ద..


భూదాన్‌పోచంపల్లిలో..


చౌటుప్పల్‌లో.. పురపాలిక ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు, సంధ్య దంపతులు, మహిళలు


నల్గొండ: ఆర్టీసీ కాలనీలో..


నూతనకల్‌లో...


ఆత్మకూరు(ఎం)లో వీర్ల చెరువు వద్ద ..

పతకాల పట్టు..!

చిలుకూరు, న్యూస్‌టుడే: వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి వెయిట్‌లిఫ్టింగ్‌లో జాతీయస్థాయిలో రాణిస్తున్నాడు. క్రీడలపై ఆసక్తితో ఎన్నో పతకాలు సాధిస్తున్నాడు మండల కేంద్రానికి చెందిన యశ్వంత్. కుమారుడి ఆసక్తిని గమనించిన తండ్రి ప్రోత్సహించాడు. 2013లో సికింద్రాబాద్‌లోని హకీంపేట క్రీడా పాఠశాలలో ప్రవేశం వచ్చింది. దాంతో చదువుతో పాటు వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకొన్నాడు.


జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో యశ్వంత్‌గౌడ్

★ హైదరాబాద్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2015లో నిర్వహించిన పోటీల్లో 50 కిలోల విభాగంలో 3వ స్థానంలో నిలిచి మొదటిసారి పతకం సాధించాడు. తర్వాత స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బంగారు పతకాన్ని సాధించి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. 2018లో ఖేల్ ఇండియా ఇంటర్నేషనల్ గేమ్స్‌కు ఎంపికయ్యాడు. 2021లో నిజామాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలో మూడు బంగారు పతకాలు సాధించాడు. గత నెల యాదాద్రి జిల్లాలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర పదో వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో 96 కిలోల విభాగంలో మొదటి స్థానంలో నిలిచాడు. అక్టోబరులో హిమాచల్ ప్రదేశ్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీలకు తెలంగాణ నుంచి అర్హత సాధించాడు.

★ ప్రభుత్వం ప్రోత్సహిస్తే జాతీయస్థాయిలో మరిన్ని పతకాలు సాధిస్తానని యశ్వంత్‌గౌడ్ తెలిపాడు.

రాగిజావ.. చిన్నారికి చేవ

అడవిదేవులపల్లి, న్యూస్‌టుడే: అంగన్‌వాడీల్లో రాగిజావ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. త్వరలో అన్నపూర్ణ ట్రస్ట్ ద్వారా పంపిణీ చేస్తున్నట్లు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఇటీవల వెల్లడించారు. కేంద్రాల్లో పోషకాహారం అందిస్తున్నా. దానికి తోడుగా రాగిజావ ఇవ్వడం ద్వారా పిల్లల్లో ఎదుగుదల పెరుగుతుందని భావిస్తున్నారు. నల్గొండ జిల్లాలోని తొమ్మిది ప్రాజెక్టుల పరిధిలో 2,096 కేంద్రాలు ఉన్నాయి. మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు 85,788 మంది, గర్భిణులు 10,245 మంది, బాలింతలు 7,009 మంది నమోదై ఉన్నారు.

◆ అంగన్‌వాడీల్లో పంపిణీకి ఏర్పాట్లు



పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు కావాల్సిన పోషకాలు ఇందులో ఉంటాయని వైద్యులు సూచిస్తున్నారు.

ఒక పూట సంపూర్ణ భోజనంలో పిల్లలకు ఉండాల్సిన పదార్థాలు

బియ్యం	75 గ్రాములు
కందిపప్పు	15 గ్రాములు
నూనె	5 మి.లీ.
గుడ్డు	1

పోషకాలిలా..

★ 100 గ్రాముల రాగుల్లో 328 క్యాలరీల శక్తి ఉంటుంది. ఐరన్ 3.9 మిల్లీగ్రాములు, సోడియం 11 మి.గ్రా, కాల్షియం 344 మి.గ్రా, పొటాషియం 408 మి.గ్రా ఉంటాయి.

★ పిల్లల ఎముకలు దృఢంగా మారడానికి కావాల్సిన కాల్షియం అందుతుంది.

★ కాల్షియం, ప్రొటీన్, ఫైబర్ అధికంగా ఉంటాయి. ఇనుము మోతాదు అధికంగా ఉండడంతో రక్తహీనత తగ్గుతుంది.

★ 'సీ' విటమిన్‌తో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.

★ కండరాల ఆరోగ్యంతో పాటు రక్తం తయారు కావడానికి దోహదపడుతుంది.


పిల్లల ఎదుగుదలకు దోహదం..

– డాక్టర్ అజహర్ అహ్మద్, ఎంవో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అడవిదేవులపల్లి

రాగి జావ ఎదిగే పిల్లలకు చాలా అవసరం. దీంట్లో ఉండే పోషకాలు వారిని బలంగా మారుస్తాయి. దీనిలో ఉండే అయోడిన్ కారణంగా ఇన్‌ఫెక్షన్లు దరి చేరవు.

శ్రమించి.. ఖాకీ కొలువు సాధించి!

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: ప్రస్తుత రోజుల్లో ప్రభుత్వ కొలువు సాధించడం అనేక మంది కల. ఉన్న కొద్దిపాటి ఉద్యోగాలకు ఎంతో మంది పోటీ పడుతున్నప్పటికి తాము కలలు కన్న ఉద్యోగం కోసం ఎన్ని కష్టాలు ఎదురైనా తట్టుకుని నిలబడి.. చివరికి ప్రభుత్వ కొలువు సాధించి అనేక మందికి ఆదర్శంగా నిలుస్తున్నారు పలువురు యువత. యూనిఫాం ఉద్యోగంపై మక్కువతో ఇటీవలే ఎస్సై ఉద్యోగాలు సాధించిన ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు యువతను 'న్యూస్‌టుడే' పలుకరించింది.



ఐదు ఉద్యోగాలు సాధించాను

– మల్లు సంజీవరెడ్డి, దిర్శించర్ల, నేరేడుచర్ల మండలం, సూర్యాపేట



మాది వ్యవసాయ కుటుంబం. అమ్మ, నాన్న ధనమ్మ, వెంకట్‌రెడ్డి వ్యవసాయం చేస్తూ నన్ను, అన్నయ్య నర్సిరెడ్డిని చదివించారు. చిన్నప్పటి నుంచి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనేది నాతో పాటు కుటుంబ సభ్యుల కల. డిగ్రీ హైదరాబాద్ నిజాం కళాశాలలో, ఎంసీఏ, ఎంబీఏ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదువుతూ, ట్యూషన్లు చెబుతూ ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమయ్యాను.

◆ 2018లో ప్రభుత్వ ఉద్యోగానికి ప్రయత్నించి విఫలమయ్యాను. దీంతో నిరాశ చెందకుండా మరింత కష్టపడి 2022-23 కాలంలో సీఆర్పీఎఫ్ ఎస్సైతో పాటు రైల్వేలో ట్రైన్ మేనేజర్, గ్రూప్-డీ ఉద్యోగాలు సాధించాను. ఈ లోగా పోలీస్ శాఖలో నోటిఫికేషన్ రావడంతో కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాలకు దరఖాస్తు చేసి రెండు ఉద్యోగాలు సాధించాను. ఎస్సైగా యాదాద్రి జోన్ టాపర్‌గా సైతం నిలిచాను. ఇలా 5 ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి.. ఇటీవలే ఎస్సై ఉద్యోగంలో చేరి.. మిర్యాలగూడ గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో శిక్షణ ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్నాను.

అమ్మ కల నెరవేర్చాను

– మారెళ్ల మౌనిక, తొగర్రాయి, కోదాడ మండలం, సూర్యాపేట జిల్లా



నేను డిగ్రీ, బీఈడీ పూర్తి చేశాను. నాన్న మాల్యాద్రి తాపీ మేస్త్రీ, అమ్మ వెంకటనర్సమ్మ గృహిణి. చదువు పూర్తయిన వెంటనే హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగంలో చేరాను. నాకు ప్రభుత్వ ఉద్యోగం సాధించడం, అమ్మకు నేను యూనిఫాం ఉద్యోగం చేయడం కల.

◆ మా ఇద్దరి కలలు నెరవేరాలనే లక్ష్యంతో ఓ వైపు ఉద్యోగం చేసుకుంటూనే ఎస్సై పరీక్షలకు సన్నద్ధమయ్యాను. రోజుకు 10 గంటల పాటు చదువుతూ.. స్వతహాగా శిక్షణ పొందాను. దీంతో రైల్వేలో గ్రూప్-4 ఉద్యోగం వచ్చింది. అమ్మ కలను నెరవేర్చాలనే ధ్యేయంతో మరోసారి ప్రయత్నించి ఎస్సై ఉద్యోగం సాధించాను. ప్రస్తుతం మిర్యాలగూడ రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో శిక్షణ ఎస్సైగా పని చేస్తున్నాను.


ఎస్సై కావడమే ధ్యేయంగా

– వర్కాల సురేష్‌రెడ్డి, బోయగూడెం, తిరుమలగిరి సాగర్ మండలం, నల్గొండ జిల్లా



మాది మధ్యతరగతి వ్యవసాయ కుటుంబం. అమ్మనాన్న రేవతి, వెంకట్ రెడ్డి వ్యవసాయం చేస్తూ నన్ను చదివించారు. చలకుర్తి నవోదయ పాఠశాలలో పదో తరగతి చదివి 10 జీపీఏ సాధించాను. దీంతో బాసర ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. ఇంటర్, ఇంజినీరింగ్ అదే కళాశాలలో 80 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాను. పోలీస్ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ఇంజినీరింగ్ చదివే సమయంలో 2020లోనే కానిస్టేబుల్ అర్హత పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించాను కానీ.. కాలికి గాయంతో ఈవెంట్స్ సాధించలేకపోయాను. దీంతో నిరుత్సాహానికి గురి కాకుండా ఎస్సై ఉద్యోగానికి సన్నద్ధమై.. ఎట్టకేలకు నా జీవిత లక్ష్యమైన ఖాకీ కొలువు సాధించాను. ప్రస్తుతం శిక్షణ ఎస్సైగా సూర్యాపేట జిల్లా చివ్వెంల పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్నాను.

పాఠశాలల్లో పర్యాటక క్లబ్‌లు



యువ టూరిజమ్ క్లబ్ లోగో

ఆలేరు, న్యూస్‌టుడే: పాఠశాలల్లో విద్యార్థులకు చదువుతో పాటు చారిత్రక, వారసత్వ అంశాలపై ఆసక్తి, పట్టు పెంచేందుకు రాష్ట్ర విద్యాశాఖ ప్రత్యేక దృష్టిని సారించింది. ఇందులో భాగంగా యువ టూరిజం పేరిట ప్రభుత్వ పాఠశాలల్లో పర్యాటక క్లబ్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుడుతోంది. ఇందుకు సంబంధించి విద్యాశాఖ ప్రణాళికను సిద్ధం చేస్తోంది. ఆయా పాఠశాలల ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో వీటిని ఏర్పాటు చేసి నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఏర్పాటు ఇలా..

ఏడు నుంచి 12వ తరగతి చదివే విద్యార్థులు ఉన్నచోట వీరిని క్లబ్‌లలో సభ్యులుగా చేర్చుతారు. ఒక్కో క్లబ్‌కు ఒక విద్యార్థి బాధ్యత వహిస్తారు. ఒక ఉపాధ్యాయుడు సమన్వయకర్తగా నాయకత్వం వహిస్తాడు. ప్రధానోపాధ్యాయుడు, సమన్వయకర్తలు పాఠశాలల్లో ఆన్‌లైన్ ద్వారా ytc.tourism.gov.in వెబ్‌సైట్‌లో తమ బడి వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. పర్యాటక వారసత్వ పరిరక్షణకు సంబంధించిన వివిధ కార్యక్రమాలలో విద్యార్థులను భాగస్వాములుగా చేస్తారు. విద్యార్థులు తమ ప్రాంత పర్యాటక స్థలాలపై విస్తృత ప్రచారం చేయడానికి ఈ క్లబ్‌లు దోహదపడతాయని ప్రభుత్వం భావిస్తోంది.

ఉమ్మడి జిల్లాలో పాఠశాలల వివరాలు..

జిల్లా	ప్రాథమికోన్నత	ఉన్నత	విద్యార్థులు
నల్గొండ	128	229	51,886
సూర్యాపేట	81	217	40,285
యాదాద్రి	70	171	32,479

నేటి నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఓపెన్‌స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. పదో తరగతి పరీక్షలు ఈ నెల 6వ తేదీ వరకు, ఇంటర్మీడియట్ 7వ తేదీ వరకు జరగనున్నాయి. నల్గొండ జిల్లాలో పదో తరగతికి 149 మంది, ఇంటర్‌కు 360 మంది హాజరుకానున్నారు. నల్గొండ డీవీకే రోడ్డులోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నారు. సూర్యాపేట జిల్లాలో పదికి 70 మంది, ఇంటర్మీడియట్‌కు 169 మంది పరీక్ష రాయనున్నారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

కో- ఆర్డినేటర్ నియామకం.. ఓపెన్‌స్కూల్ ఉమ్మడి నల్గొండ జిల్లా కో- ఆర్డినేటర్‌గా కె.సత్తమ్మ నియమితులయ్యారు. యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీహెచ్‌ఎంగా పనిచేస్తున్న ఆమె రెండు రోజుల క్రితం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కో- ఆర్డినేటర్‌గా పనిచేసిన జగదీశ్ మూడేళ్ల కాలం పూర్తి కావడంతో అతడిని సూర్యాపేట డీఈవో కార్యాలయానికి అటాచ్ చేశారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	110–00
రిటైల్	132–00
డ్రెస్డ్	191–00
స్కిన్‌లెస్	218–00

కుట్టు శిక్షణ.. ఉపాధికి రక్షణ


కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలు, యువతులు

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: అందమైన వస్త్రాలు తీర్చిదిద్దే నేర్పు, పట్టుదల, కష్టపడే తత్వం ఉంటే మార్కెట్‌లో టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్‌కు మంచి గిరాకీ ఉంది. అలాంటి తత్వాన్ని నేర్పిస్తూ మహిళల స్వయం ఉపాధికి దోహదపడేందుకు ఎస్‌బీఐ గ్రామీణ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఆర్‌సెట్) గ్రామీణ స్వయం ఉపాధి సంస్థగా పనిచేస్తోంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లేని మహిళలను గుర్తించి చేతివృత్తిలో భాగంగా కుట్టు శిక్షణ ఇస్తోంది. ఉచిత కుట్టు శిక్షణ వారి స్వయం ఉపాధికి మార్గం వేస్తోంది. మహిళలు, యువతులకు కుట్టు, అల్లికలు, టైలరింగ్‌లో తర్ఫీదు ఇస్తూ వారి భవిష్యత్తుకు భరోసా నింపుతోంది. మూస పద్ధతుల్లో కాకుండా అధునాతన డిజైన్లు నేర్పుతున్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి ధ్రువపత్రాలు అందించి బ్యాంకు ద్వారా రుణాలు తీసుకునే అవకాశం కల్పిస్తున్నారు. ఆర్‌సెట్ ఆధ్వర్యంలో నల్గొండలో 35 మందికి నెల రోజుల పాటు తరగతులు నిర్వహిస్తారు. థియరీతో పాటు ప్రాక్టికల్స్ ఉంటాయి. ఉచిత భోజన వసతి కల్పిస్తారు.

కొత్త డిజైన్లకు డిమాండ్..



అంజలి, సజ్జపురం తండా, పాలకవీడు మండలం

నేను ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నా. ఖాళీగా ఇంటి వద్ద ఉండకుండా కుట్టు శిక్షణ పొందుతున్నా. భవిష్యత్తులో ఉపాధికి అవకాశం ఉంటుంది. విపణిలో వస్తున్న మార్పులకు అనుగుణంగా కొత్త కొత్త డిజైన్లు నేర్పిస్తున్నారు. కుట్టు నేర్చుకున్న తరువాత గ్రామంలోనే టైలరింగ్ దుకాణం ఏర్పాటు చేసుకుంటా.

సద్వినియోగం చేసుకుంటున్నా..



మౌనిక, అల్వాల, నల్గొండ జిల్లా

మహిళలు, యువతులకు కావాల్సిన విధానంలో టైలరింగ్ నేర్పుతున్నారు. సొంతంగా ఆర్థిక ప్రగతి సాధిస్తానన్న నమ్మకం ఉంది. శిక్షణ పూర్తి చేశాక సొంతంగా దుకాణం ఏర్పాటు చేసుకుని కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉంటా.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని సుర్థేపల్లి గ్రామ సమీపంలో అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం అమీనాబాద్‌కు చెందిన గుండు లక్ష్మణ్(35) కొత్తూరు-సుర్థేపల్లి గ్రామాల మధ్య రహదారి వారగా పడి మృతి చెంది ఉండటాన్ని గుర్తించారు. శరీరంపై స్వల్ప గాయాలతో పక్కనే ద్విచక్ర వాహనం పడిపోయి ఉండటాన్ని అటుగా వెళ్తున్న స్థానికులు చూశారు. పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. తన కుమారుడు అనుమానాస్పదంగా మృతి చెందాడని లక్ష్మణ్ తల్లి ఠాణాలో ఫిర్యాదు చేశారు.

విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా..

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో లారీ ట్రాన్స్‌పోర్టు అసిస్టెంట్ మేనేజర్ దుర్మరణం పాలైన ఘటన పట్టణంలోని కోదాడ రోడ్డులో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలం వేదాద్రి గ్రామానికి చెందిన పెసరమల్లి నరేష్‌బాబు(32) కొన్ని సంవత్సరాలుగా పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. కోదాడ పట్టణంలోని ఓ లారీ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో అసిస్టెంట్ మేనేజరుగా పని చేస్తున్నారు. రోజు మాదిరిగా మంగళవారం కోదాడలో విధులకు వెళ్లి రాత్రి ఇంటికి తిరిగి వస్తుండగా మల్లన్ననగర్ సమీపంలోకి రాగానే వెనుక నుంచి టిప్పర్ ఢీకొంది. రోడ్డుపై పడిపోవడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడి తమ్ముడు ఆదినారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పూలధర పూసింది

★ రెండింతలు పెరిగిన వైనం


సూర్యాపేటలో విక్రయానికి పూలు

భానుపురి, కుడకుడరోడ్డు (సూర్యాపేట), న్యూస్‌టుడే: పూల ధరలకు రెక్కలొచ్చాయి. ఏటా వీటి ధరలు పెరుగుతూనే ఉన్నాయి. సామాన్యులు కొనలేనంతగా ఉంటున్నాయి. పండగల వేళ కాకుండా మామూలు రోజుల్లోనూ తగ్గడం లేదు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో పూల సాగు తక్కువగా ఉంటుంది. ఒకవేళ చేపట్టినా బంతి రకాలపైనే దృష్టిసారిస్తారు. చామంతి, గులాబీ, సీతజడ, తదితర రకాల పూలను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయటం లేదు. దీంతో ధరలపై ప్రభావం పడుతోంది.

ధరలు ఇలా..

మార్కెట్లలో వ్యాపారులు చామంతి, గులాబీ, తెల్లచామంతి, బంతి, సీతజడ, తదితర రకాల పూలు విక్రయిస్తుంటారు. చామంతికి గతేడాది కిలో రూ.250 ఉండగా ప్రస్తుతం రూ.400 పలుకుతోంది. గులాబీ పూలు గతేడాది రూ.150 ఉండగా నేడు రూ.400, తెల్లచామంతి గతేడాది రూ.100, ప్రస్తుతం రూ.300, బంతి రూ.50 ఉండగా ప్రస్తుతం రూ.150 ఉంది. ఇలా ధరలు రెట్టింపవటంతో కొనుగోలుదారులు కాస్తా ఆచితూచి కొనాల్సిన దుస్థితి నెలకొంది.

★ ఉమ్మడి జిల్లాలో 220 మంది పూల వ్యాపారులున్నారు. కొన్ని పూలకు రెట్టింపుతోపాటు మరి కొన్ని పూలు రెండింతలు ధరలు పెంచారు. ప్రస్తుతం పండగ సీజన్ కావడంతో సామాన్యులు కొనుగోలు చేయాలంటే ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రెండుమూడు కిలోలు ఖరీదు చేసినవారు నేడు కిలోకే పరిమితమయ్యారు. ఒక్క పూలకే ప్రతి ఒక్కరూ రూ.1500 నుంచి రూ.2 వేల వరకు ఖర్చు చేస్తున్నారు.

ఎక్కడి నుంచి వస్తున్నాయంటే..

స్థానికంగా పూల సాగు తక్కువగా ఉండటంతోపాటు వ్యాపారులు మహారాష్ట్ర, బెంగళూరు, హైదరాబాద్ ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. రవాణా ఖర్చులు కూడా గతంలో టన్ను రూ.10,000 ఉండగా నేడు రూ.16,000 వరకు పెరిగింది. ఒక్క టన్నుకే రూ.6 వేలు పెరగటంతో లాభాలు అంతంతగానే ఉంటున్నాయని పలువురు వ్యాపారులు వాపోతున్నారు.

గతంలో బాగా లాభాలు

– కందుకూరి సన్ని, పూల వ్యాపారి, సూర్యాపేట



గతంలో ధరలు తక్కువగా ఉండటంతో లాభాలు బాగున్నాయి. ప్రస్తుతం ధరలు పెరిగినా రవాణా, కూలీల ఖర్చులు పోను అంతగా లాభాలు ఉండటం లేదు. ముగ్గురు పని వాళ్లు అవసరం. వారికి ఒక్కొక్కరికి నెలకు రూ.20 వేతనం ఇవ్వాల్సి వస్తోంది. అన్ని పోను నెలకు రూ.50 వేల ఆదాయం వస్తుంది. గతేడాది రూ.80 నుంచి 90 వేల వరకు ప్రతి నెలా లాభాలుండేవి.

తొలగిన తాగునీటి సమస్య

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: దిర్సినచర్ల గ్రామపంచాయతీ పరిధిలోని ఎన్టీఆర్ కాలనీ ఏరియాలో కాలిపోయిన తాగు నీటి మోటారుని గ్రామకార్యదర్శి రమ బాగు చేయించడంతో బుధవారం సిబ్బంది మోటారును అమర్చి పైప్‌లైన్ నీటి సరఫరాకు ఏర్పాట్లు చేశారు. ఆ ప్రాంత వాసులు మంగళవారం తాగు నీటి కోసం ఆందోళన చేయడంతో కార్యదర్శి స్పందించి వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

మునగాల, న్యూస్‌టుడే: చారిట్రెస్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎస్సై ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వరద బాధితులకు నిత్యావసరాలు, బీరలు, దుప్పట్లు, వంట సామగ్రి మొదలైన వాటిని పంపిణీ చేయడానికి వెళ్తున్న వాహనాన్ని మండల కేంద్రంలో జెండా ఊపి ప్రారంభించారు. ఫౌండేషన్ ద్వారా అనాథ పిల్లల ఆశ్రమాలు, వరద బాధితులకు చేయూతనివ్వడం అభినందనీయం అన్నారు.

కోదాడ

•కోదాడ •హుజూర్‌నగర్

4న ప్యాక్స్ సర్వజన సభ

నడిగూడెం, న్యూస్‌టుడే: నడిగూడెం ప్యాక్స్ సర్వజన సభ శుక్రవారం నడిగూడెం రైతు వేదికలో నిర్వహిస్తున్నట్లు ప్యాక్స్ ఛైర్మన్ కొల్లు రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్యాక్స్ పరిధిలోని పాలకవర్గం సభ్యులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని సలహాలు, సూచనలివ్వాలని కోరారు.

గ్రామ సభ నిర్వహించి.. పనులపై సమీక్షించి

చిలుకూరు, న్యూస్‌టుడే: కూలీలందరికీ నిబంధనల ప్రకారం ఉపాధిహామీ పనులు కల్పిస్తామని మండలంలోని మేజర్ పంచాయతీ ప్రత్యేక అధికారి, నాయబ్ తహసీల్దారు కరుణశ్రీ అన్నారు. బేతవోలులోని గ్రామ సభలో ఉపాధిహామీ పనులపై బుధవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, ఈసీ రవి పాల్గొన్నారు.

★మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన గ్రామసభ వాగ్వాదాలకు వేదికగా మారింది. గ్రామంలో విద్యుత్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియడం లేదని, తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని విద్యుత్ అధికారులు, సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఎంపీడీవో గిరిబాబు కల్పించుకొని త్వరలో గ్రామపంచాయతీ కార్యాలయంలో విద్యుత్ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని, సమస్యకు శాశ్వత పరిష్కారం చేస్తామని చెప్పడంతో సమస్య సద్దుమణిగింది.

మునగాల: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. ఉపాధి హామీలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో పనుల గుర్తింపు ప్రణాళికలు తయారు చేయడంపై సమీక్ష నిర్వహించారు.

అవగాహన

నడిగూడెం: వరిలో సహజ సిద్ధ పద్ధతులతో చీడ పీడలు నివారించవచ్చని సిరి ఫౌండేషన్ నిర్వాహకుడు ఎం.గోపయ్య రైతులకు సూచించారు. బుధవారం చాకిరాలలో వరి సాగును పరిశీలించారు. రైతులకు అవగాహన కల్పించారు.

కల్వర్టు ఛిద్రం.. జర భద్రం

ఛిద్రమైన రహదారులు, కల్వర్టులు, వంతెనలపై ప్రయాణించటానికి వాహన చోదకులు భయపడుతున్నారు. ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. మఠంపల్లి, జాన్‌పహాడ్ మీదుగా ఉన్న దామరచర్ల ప్రధాన రహదారిపై రామాపురం గ్రామ సరిహద్దులో ఉన్న లోతట్టు కల్వర్టుకు బుంగ పడి శిథిలమైంది. కింద ఉన్న గూనల పక్కన మట్టి జలిపల వరదలకు కొట్టుకుపోవటంతో సీసీ రహదారి కుంగి గుంతలమయంగా మారింది. మూల మలుపులో ఉన్న గుంత రాత్రి వేళల్లో దగ్గరకు వచ్చేవరకు కనిపించకపోవడంతో చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లోతట్టులో ఉన్న కల్వర్టు ఎత్తు పెంచి ప్రమాదాలు నివారించాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఇన్‌ఛార్జి ఆర్‌అండ్‌బీ ఏఈ శివకుమార్‌ను వివరణ కోరగా దెబ్బతిన్న రహదారులను మరమ్మతు చేయించడానికి నిధుల మంజూరుకు దస్త్రాలు ఉన్నతాధికారులకు పంపామని, అనుమతులు రాగానే చోదకుల ఇబ్బందులు తొలగిస్తామన్నారు.

–పాలకవీడు గ్రామీణం, న్యూస్‌టుడే:



రామాపురం వద్ద గుంతలమయంగా కల్వర్టు

ఉమ్మడి జిల్లా క్రికెట్ పోటీల ఎంపిక వాయిదా

మునగాల, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం జరగాల్సిన అండర్-14 ఉమ్మడి జిల్లా క్రికెట్ పోటీల ఎంపిక వర్షం కారణంగా వాయిదా వేసినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ అజాం బాబా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 3న నిర్వహించాల్సిన క్రికెట్ పోటీల ఎంపికలను 5న సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కుడకుడ రహదారిలో ఎస్‌జీఎం క్రికెట్ అకాడమీలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

సాయమందితేనే.. సాగు ముందుకు

నడిగూడెం, న్యూస్‌టుడే: సాగర్ ఎడమ కాల్వకు 132 కి.మీ వద్ద గండి పడిన విషయం విదితమే. గండి వల్ల కాగితరామచంద్రాపురం పరిసరాల్లో సాగు చేసిన పంట పొలాలు వరద నీటిలో కొట్టుకుపోయాయి. నెలరోజులు కావస్తున్నా నేటి వరకు తమకు పరిహారం అందలేదని బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లో ఇసుక, కంకర, రాళ్లు కుప్పలుగా మిగిలాయని, వాటిని తొలగించేందుకు సంబంధిత శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. నాటు వేసిన పంట పొలాలతో పాటు, మోటార్లు నడిచేందుకు ఏర్పాటు చేసుకున్న విద్యుత్తు స్తంభాలు తీగలతో సహా వరద తాకిడికి కొట్టుకుపోయాయని రైతులు తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పంట నష్టపోయిన రైతుల వివరాలు సేకరించినా నేటికీ పరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు రూ.16,500 ఇస్తామని గండి పరిశీలించడానికి వచ్చిన, మంత్రులు, అధికారులు హామీ ఇచ్చారని, పరిహారం మంజూరుకు నోచుకోకపోవడంతో పొలాలను బాగు చేసుకునేందుకు డబ్బుల్లేక ముందుకు వెళ్లలేక పోతున్నామని వాపోతున్నారు.

☛ ఇంకా కొంత మంది రైతుల భూములు వరద నీటితో నిండి ఉన్నాయి. నీటిని తొలగించేందుకు రైతులకు సాయం చేయాలని మంత్రి ఉత్తమ్ ఆదేశించినా స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. గండి వల్ల 362 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. పరిహారంతో పాటు పూర్తిగా ఇసుక, రాళ్ల దిబ్బలుగా మారిన తమ భూములను సాగు భూములుగా మార్చుకునేందుకు ప్రభుత్వం సాయం చేసి తమను ఆదుకోవాలని బాధితులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకుని పరిహారం మంజూరుకు చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

నివేదిక పంపించాం:

ఎల్లయ్య, వ్యవసాయ సహాయ సంచాలకుడు, కోదాడ

సాగర్ ఎడమ కాల్వ గండి వల్ల పంట నష్టపోయిన రైతుల వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, విచారణ జరిపి నివేదికను ప్రభుత్వానికి పంపాం. ఎడమ కాల్వకు నీటి సరఫరా లేక సాగులో ఉన్న పంటలు ఎండిపోయిన వివరాలు సైతం సేకరించి నివేదిక అందజేశాం.



కేఆర్సీపురంలో వరద నీటికి ఇసుక మేటలు వేసిన పొలం

నడిగూడెంలో మినీ స్టేడియం ఏర్పాటుకు కృషి

నడిగూడెం, న్యూస్‌టుడే: నడిగూడెంలో మినీ స్టేడియం ఏర్పాటు విషయం మంత్రి ఉత్తమ్ దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో కార్యరూపం దాల్చేలా ప్రయత్నాలు కొనసాగుతున్నాయని పీసీసీ డెలిగేట్ లక్ష్మీనారాయణరెడ్డి అన్నారు. బుధవారం నడిగూడెం మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఖమ్మం, నల్గొండ ఉమ్మడి జిల్లాల స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. పోటీల నిర్వహణకు ముందుకు వచ్చిన యూత్ కాంగ్రెస్ నాయకులను అభినందించారు. మండల అధ్యక్షుడు బి.వెంకటరెడ్డి, నిర్వాహకులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న లక్ష్మీనారాయణరెడ్డి, వెంకటరెడ్డి

27న మహారుద్రాభిషేకం

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: లోక కల్యాణార్థం జరిగే మహారుద్రాభిషేకం విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని నిర్వహణ కమిటీ కోరింది. ఈనెల 27న ఎస్సెస్పీ క్యాంపు ఉన్నత పాఠశాల ఆవరణలో మహారుద్రాభిషేకం జరుగుతుందని తెలిపారు. హుజూర్‌నగర్‌లో మొదటిసారి 45 మంది నాగ సాధువులతో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందుకు అవసరమైన వస్తువుల సేకరణ, తదితర విషయాలపై సమీక్షించారు. కమిటీ సభ్యులు ప్రభాకర్, నాగేశ్వరరావు, విజయ్, మల్లిఖార్జున్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధం: సీపీఎం

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్రంలో భాజపా ప్రభుత్వం ఒకే భాష, ఒకే ఎన్నికలు నినాదంతో జమిలి ఎన్నికలు నిర్వహించాలని ఆర్డినెన్స్ తీసుకురావడం రాజ్యాంగ విరుద్ధమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పల్లె వెంకటరెడ్డి అన్నారు. కరక్కాయలగూడెంలో బుధవారం నిర్వహించిన ఆ పార్టీ గ్రామశాఖ మహాసభలో మాట్లాడారు. రాష్ట్రాల హక్కులను హరించేందుకే జమిలి ఎన్నికలను భాజపా తెరమీదకు తెచ్చిందని విమర్శించారు. పార్లమెంట్, శాసనసభలతో పాటు సర్పంచి, జడ్పీటీసీ ఎన్నికలు ఒకేసారి నిర్వహించాలని ప్రభుత్వం చూస్తుందని, దాన్ని సీపీఎం వ్యతిరేకిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ, రైతు భరోసాల విషయంలో రైతులకు స్పష్టత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బ్రహ్మం, మండల కార్యదర్శి హుస్సేన్, శ్రీను, వీరయ్య పాల్గొన్నారు.

మునగాల గ్రామీణం: వరద బాధితులకు ఆర్థికసాయం అందించాలని సీపీఎం రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరాములు అన్నారు. కలకోవలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కూచిపూడి, తొగర్రాయి, కాపుగల్లు, గోండ్రియాల గ్రామాలలో తీవ్రంగా నష్టపోయారని, నెల రోజులు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి నష్టపరిహారం రాకపోవడం బాధాకరమని అన్నారు.

మేళ్లచెరువు: పేదల కోసమే సీపీఎం పోరాటాలు చేస్తుందని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు వెంకటరెడ్డి అన్నారు. రేవూరులో నిర్వహించిన గ్రామ మహాసభ సమావేశంలో మాట్లాడారు.

ఉత్సవాలకు సర్వం సిద్ధం

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు నేరేడుచర్ల విజయదుర్గ ఆలయంలో జిల్లాలోనే అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. గురువారం నుంచి 12వ తేదీ వరకు అమ్మవారు రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. సామూహిక కుంకుమార్చనలు, విద్యార్థులతో సరస్వతి పూజ, శమీపూజ నిర్వహిస్తామని ఆలయ ఛైర్మన్ కొణతం ఆదిరెడ్డి, ఆలయకమిటీ అధ్యక్షుడు చిన్నవెంకటరెడ్డి, అర్చకుడు శ్రీనివాసాచార్యులు తెలిపారు. ఈ ఏడాది విజయదుర్గ ఆలయం 12వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 6న మహాకుంభాభిషేకం నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.



ముస్తాబైన విజయదుర్గ ఆలయం

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ శ్రీకనకదుర్గ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారిని శ్రీబాల ప్రసూనాంబిక దేవి(పసుపుతో)గా బుధవారం అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ అన్నమయ్య భజన మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమం జరిగింది.



రంగురంగుల పూలు తెచ్చి.. బతుకమ్మను పేర్చి



చింతలపాలెం: బతుకమ్మలను నదిలో వదులుతున్న విద్యార్థులు

న్యూస్‌టుడే బృందం: బతుకమ్మ వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలతో మహిళలు సందడి చేశారు. కొన్ని చోట్ల సాయంత్రం వర్షం, గాలి దుమారం రావడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో కొంత ఇబ్బంది పడ్డారు.



మఠంపల్లి: కనకదుర్గాదేవి ఆలయంలో..



నడిగూడెం శ్రీకోదండ రామాలయంలో..



హుజూర్‌నగర్‌లోని ఎన్‌జీవోస్ కాలనీలో మహిళల సందడి



మోతెలో ఎంగిలిపూల బతుకమ్మలతో తరలి వెళ్తున్న మహిళలు..



నేరేడుచర్లలో విద్యానగర్ రామాలయం వద్ద బతుకమ్మ వేడుక

మహాత్ముడి మార్గం.. అనితర సాధ్యం



హుజూర్‌నగర్ కోర్టు ఆవరణను శుభ్రం చేస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: హింసామార్గం సమాజానికి శ్రేయస్కరం కాదని సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యామ్‌కుమార్ అన్నారు. వ్యక్తిగతమైన లాభాపేక్ష కోసం ఎదుటి వ్యక్తిపై దౌర్జన్యానికి, దాడులకు పాల్పడి జైలు పాలు కావటం వల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. బుధవారం హుజూర్‌నగర్ సబ్‌జైలులో ఖైదీలకు నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. క్షణికావేశంలో జైలు పాలైన వారు జైలును మానసిక పరివర్తన కేంద్రంగా భావించి ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ మాట్లాడారు. ఖైదీలకు న్యాయమూర్తులు పండ్లు పంపిణీ చేశారు. కాల్వ శ్రీనివాసరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో సీఐ చరమందరాజు, ఎస్సై ముత్తయ్య, ఏజీపీ బానోతు సురేష్‌కుమార్, నగేష్‌రాథోడ్, శంకర్‌నాయక్, సంధ్య, సబ్‌జైలు సూపరింటెండెంట్ మంగ్తా, మంత్రిప్రగడ సీతారామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కోర్టు ఆవరణలో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఆవరణలో చెత్తలేకుండా న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది శుభ్రం చేశారు.

❖ వరదల వేళ పారిశుద్ధ్య కార్మికులు అందించిన సేవలను వెలకట్టలేమని కోదాడ పుర ఛైర్‌పర్సన్ ప్రమీల, పుర కమిషనర్ రమాదేవి అన్నారు. ప్రతిభ కనబరిచిన కార్మికులకు స్వచ్ఛత హీ సేవా అవార్డులను అందజేశారు.

❖ కిట్స్ కళాశాలలో మహాత్మాగాంధీ, లాల్ బహుదూర్‌శాస్త్రి జయంతి సందర్భంగా వారి చిత్రాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

న్యూస్‌టుడే బృందం: గాంధీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. వివిధ సంఘాలు, యూనియన్లు, పార్టీలు, ప్రభుత్వ కార్యాలయాల్లో గాంధీ చిత్రపటానికి, విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. పలుచోట్ల పారిశుద్ధ్య సిబ్బందిని సన్మానించారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించారు.



నేరేడుచర్ల: పారిశుద్ధ్య సిబ్బందికి దుస్తులు పంపిణీ చేస్తున్న పురఛైర్మన్ ప్రకాశ్, వైస్ ఛైర్‌పర్సన్ సరిత



హుజూర్‌నగర్: పురపాలక సంఘ కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న కమిషనర్ యాకుబ్‌పాషా, తదితరులు



కోదాడ: కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..



చిలుకూరు: సన్మానం పొందిన పంచాయతీ సిబ్బంది

ట్రాక్టర్ పల్టీ.. రైతు మృతి

గరిడేపల్లి, న్యూస్‌టుడే: ట్రాక్టర్ పల్టీ కొట్టి రైతు మృతి చెందిన ఘటన కల్మల్‌చెరువులో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అవిరబోయిన వెంకన్న(45) పచ్చిగడ్డి కోసుకు వచ్చేందుకు తన ట్రాక్టర్‌పై పొలానికి వెళ్లాడు. మార్గమధ్యలో రోడ్డు పక్కన జారడంతో ట్రాక్టర్ పల్టీ కొట్టింది. ట్రాక్టర్‌పై ఉన్న వెంకన్నకు గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై ఫిర్యాదు అందలేదని ఎస్సై నరేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థినులకు గాయాలు

గరిడేపల్లి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఇంటర్ విద్యార్థులకు గాయాలైన ఘటన బుధవారం ఎల్బీనగర్‌లో చోటుచేసుకుంది. నేరేడుచర్లకు చెందిన నక్క సాయిశ్రీ, గరిడేపల్లి మండలం గానుగబండ గ్రామానికి చెందిన ఈద మేఘన స్కూటీపై నేరేడుచర్లకు వెళ్తున్నారు. ఎల్బీనగర్ గ్రామంలో లారీని క్రాస్ చేస్తుండగా ప్రమాదవశాత్తు లారీకి తగిలి కింద పడిపోయారు. దాంతో ఇద్దరికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. 108లో ముందుగా హుజూర్‌నగర్, మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించినట్లు బంధువులు పేర్కొన్నారు. వీరిద్దరూ గడ్డిపల్లి ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఫిర్యాదు అందలేదని ఎస్సై నరేష్ తెలిపారు.

100 కిలోల బెల్లం, రెండు ద్విచక్రవాహనాలు సీజ్

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: హుజూర్‌నగర్ సర్కిల్ పరిధిలో ఎక్సైజ్ అధికారులు చేసిన దాడుల్లో 100 కిలోల బెల్లం, రెండు ద్విచక్ర వాహనాలు, మూడు లీటర్ల సారాను బుధవారం పట్టుకొని సీజ్ చేశారు. సీఐ నాగార్జున్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. . గరిడేపల్లి మండలం కాల్వపల్లికి చెందిన దుగ్గి శ్రీనివాస్ ద్విచక్రవాహనంపై 50 కిలోల బెల్లాన్ని, మూడు లీటర్ల సారాను తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు. హుజూర్‌నగర్‌కు చెందిన షేక్ అబ్దుల్లా తన వాహనంపై 50 కిలోల బెల్లాన్ని తరలిస్తుండగా రాయినిగూడెం గ్రామ శివారులో పట్టుకున్నామన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై వెన్నెల, సిబ్బంది నాగయ్య, నాగరాజు, రవికుమార్, బాలు తదితరులు పాల్గొన్నారు.

నేలవాలిన వృక్షాలు..

నిలిచిన రాకపోకలు

నడిగూడెం, న్యూస్‌టుడే: నడిగూడెం మండలంలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షం, గాలి దుమారానికి పలు రహదారులపై పెద్ద పెద్ద వృక్షాలు రోడ్డుపై పడిపోయాయి. రామాపురం, కృష్ణానగర్, కేఆర్సీపురం రహదారిపై చెట్లు పడిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వెంటనే స్పందించిన స్థానిక ఎస్సై అజయ్‌కుమార్ పొక్లెయిన్‌లతో చెట్లను తొలగించే చర్యలు చేపట్టారు. రాకపోకలను పునరుద్ధరించారు.



రామాపురం రహదారిపై పడిన పెద్ద వృక్షాన్ని పొక్లెయిన్‌తో తొలగిస్తున్న ఎస్సై అజయ్‌కుమార్

పట్టణంలో బుధవారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన వర్షం దాదాపు గంట సేపు కురిసింది. వర్షం వచ్చే ముందు కారుమేఘాలు కోదాడ పట్టణాన్ని దట్టంగా అలుముకోవడంతో ఆ చిత్రాన్ని 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది.

–కోదాడ న్యూస్‌టుడే:



అవీ ఇవీ

ఆవిర్భావ వేడుకలు.. మునగాల: కేవీపీఎస్ (కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం) ఆవిర్భావ వేడుకలను బుధవారం కొక్కిరేణిలో నిర్వహించారు. కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నందిగామ సైదులు జెండా ఎగురవేసి మాట్లాడారు. దళితులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు చేసిందన్నారు.

కోదాడ పట్టణం: కోదాడ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(లియాఫీ) అసోసియేషన్ అధ్యక్షుడు కె.మోహన్‌రెడ్డి స్థానిక కార్యాలయంలో లియాఫీ 60వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించారు.

రైతులను మోసం చేస్తున్న భాజపా.. చిలుకూరు: కేంద్రంలో అధికారంలో ఉండి రైతులకు ప్రయోజనాలు కల్పించకపోగా, భాజపా నాయకులు రాష్ట్రంలో దొంగదీక్షలు చేస్తున్నారని కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు వెంకటయ్య అన్నారు. చిలుకూరులో బుధవారం జరిగిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలకు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించడంలో కేంద్రం విఫలమైందన్నారు. పుల్లారావు, శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

వినతి.. మునగాల: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో సామాజిక కార్యకర్త గంధం సైదులు నవరాత్రోత్సవాలను పురస్కరించుకొని మండల కేంద్రంలో వీధి దీపాలను ఏర్పాటు చేయాలని, వీధులను శుభ్రపరచాలని ప్రత్యేకాధికారి ఆంజనేయులుకు వినతి పత్రాన్ని అందజేశారు.

మునగాల గ్రామీణం: దేవాలయ భూములు కాపాడాలని మహాత్మాగాంధీ చిత్రపటానికి వినతిపత్రం అందజేసినట్లు సామాజిక కార్యకర్త సత్యనారాయణ తెలిపారు. నర్సింహాపురంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో గాంధీ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.

పాలకవీడు గ్రామీణం: గత ప్రభుత్వం మంజూరు చేసిన దళిత బంధు యూనిట్ల లబ్ధిదారుల ఖాతాల్లో వెంటనే నిధులు జమచేయాలని భారాస నాయకుడు సతీశ్ డిమాండ్ చేశారు. మండల పరిషత్తు కార్యాలయం ఎదుట బుధవారం లబ్ధిదారులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఎంపీడీవో లక్ష్మికి వినతిపత్రం అందించారు.

సన్మానం.. నడిగూడెం: ఇటీవల ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో శ్రీరంగాపురం గ్రామానికి చెందిన కందిమళ్ల రవి స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్ విభాగంలో జిల్లాలో మొదటి ర్యాంకు సాధించాడు. బుధవారం గ్రామస్థులు, స్నేహితులు సత్కరించారు.

నియామకం.. హుజూర్‌నగర్ గ్రామీణం: బూరుగడ్డలో శ్రీఆదివరాహ లక్ష్మీనృసింహ వేణుగోపాల స్వామి ఆలయ నూతన ధర్మకర్తలుగా నియామకమైన వారు 4వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు ఈవో ఎంపీ లక్ష్మణ్‌రావు తెలిపారు. ధర్మకర్తలుగా యరగాని గురవయ్య, గంధం అంజయ్య, హరీష్, కవిత, సరసింహరావు, కృష్ణప్రసాద్, హనుమంతరావు, ముడుంబై హరీష్ కుమారాచార్యులు నియామకం అయ్యారని తెలిపారు.

నివాళి.. హుజూర్‌నగర్ గ్రామీణం: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తంరెడ్డి ఇటీవల మృతి చెందారు. పట్టణానికి చెందిన నలుపురు నాయకులు మంత్రిని బుధవారం పరామర్శించి పురుషోత్తంరెడ్డి చిత్రపటానికి నివాళి అర్పించారు. నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు షేక్ సైదా, గీత పారిశ్రామిక సంఘం అధ్యక్షులు కృష్ణ, మన్సూర్‌అలీ, తదితరులు పాల్గొన్నారు.

నడిగూడెం: మంత్రి ఉత్తమ్ తండ్రి పురుషోత్తం రెడ్డి చిత్రపటానికి మాజీ ఎంపీపీ బుధవారం హైదరాబాదులో నివాళి అర్పించారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సినిమాలు కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

విష్ణురామ్: దేవర, సత్యం సుందరం, **శ్రీనివాస:** దేవర, **కాన్‌ప్లెక్స్:** దేవర, **రంగా:** సత్యం సుందరం **వెంకటేశ్వర:** మత్తువదలరా-2

సూర్యాపేట

• సూర్యాపేట • తుంగతుర్తి

కులవ్యవస్థ నిర్మూలనకు కృషి చేయండి

నూతనకల్, న్యూస్‌టుడే: ప్రజలను కుల, మతాలు పట్టి పీడిస్తున్నాయని తీవ్రమైన అసమానతలు, వివక్షత ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రతి ఒక్కరు కుల వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి డేవిడ్‌కుమార్, టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రాచూరి ప్రతాప్‌లు కోరారు. నూతనకల్ మండలం చిల్పకుంట్లలో మంగళవారం రాత్రి జ్యోతిబా పులే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సభలో పాల్గొని మాట్లాడారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు సైదులు, దేసోజు మధు, సంజీవ, భూపాల్‌రెడ్డి, సుజాత, అశోక్ పాల్గొన్నారు.

అధిక ధరలను నియంత్రించండి

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు


భక్తళాపురంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు

అన్నారు. మండలంలోని భక్తళాపురంలో బుధవారం నిర్వహించిన పార్టీ శాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. ధరలు అధికంగా పెరగడంతో పేదల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు చేపట్టాలని కోరారు. మండల కార్యదర్శి రణపంగ కృష్ణ, జిల్లా కమిటీ సభ్యుడు వీరబోయిన రవి, అడివయ్య, పీరయ్య, రమేశ్, సైదులు, గోపయ్య, నవీన్ పాల్గొన్నారు.

ట్రాక్టరు చోరీ.. దొంగల రిమాండ్

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: ట్రాక్టరును చోరీ చేసిన ఇద్దరు దొంగలను ఆత్మకూర్(ఎస్) పోలీసులు పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్ చేశారు. ఎస్సై వై.సైదులు తెలిపిన వివరాల మేరకు.. నల్గొండ జిల్లా నకిరేకల్‌కు చెందిన సంపంగి దుర్గాప్రసాద్ బండరాయి కొట్టేందుకు గతంలో ఆత్మకూర్(ఎస్), గుడితండా గ్రామాలకు వచ్చాడు. గుడితండాకు చెందిన ధరావత్ రవి ట్రాక్టరును కౌలు వ్యవసాయ క్షేత్రం వద్ద ఉంచాడు. అక్కడే బండరాయి కొట్టిన దుర్గాప్రసాద్ దానిని దొంగతనం చేయాలని పన్నాగం పన్నాడు. సెప్టెంబరు 21న అర్ధరాత్రి నకిరేకల్ నుంచి వచ్చిన నిందితుడు సూర్యాపేటలో తన బంధువు పసుపుల రవిని తీసుకొని వచ్చి.. ట్రాక్టరు తీసుకెళ్లారు. అపహరించిన ట్రాక్టరును నిందితులు మహబూబాబాద్‌లో విక్రయించేందుకు మంగళవారం వెళ్లగా అక్కడ పత్రాలు లేవని ఎవరూ కొనలేదు. దీంతో ఇద్దరు తిరిగి వస్తుండగా.. పాతర్లపహాడ్ స్టేజీ వద్ద పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు. నిందితులనుంచి ట్రాక్టరు, ద్విచక్రవాహనం, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. దుర్గాప్రసాద్‌పై గతంలో కేతేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ట్రాక్టరు దొంగతనం కేసు నమోదైంది. సూర్యాపేట డీఎస్పీ రవి ఆధ్వర్యంలో గ్రామీణ సీఐ సురేందర్‌రెడ్డి, సీసీఎస్ సీఐ శివకుమార్, స్థానిక ఎస్సై, సీసీఎస్ ఎస్సై, సిబ్బంది కలిసి కేసు చేధించినట్లు తెలిపారు.

నల్లబెల్లం తరలిస్తున్న ఇద్దరిపై కేసు


పోలీసులు స్వాధీనం చేసుకున్న నల్లబెల్లం

నూతనకల్ గ్రామీణం, న్యూస్‌టుడే: అక్రమంగా నల్లబెల్లం, పటిక తరలిస్తున్న ఆటోని సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేంద్రనాథ్ తెలిపారు. సూర్యాపేట నుంచి తుంగతుర్తి వెళ్తున్న ప్యాసింజర్ ఆటోను మండల కేంద్రంలో బుధవారం తనిఖీ చేయగా 50 క్వింటాళ్ల నిషేధిత నల్లబెల్లం, 4 క్వింటాళ్ల పటిక పట్టుబడిందన్నారు. తుంగతుర్తి మండలం దొనబండ తండాకు చెందిన లకావత్ హరిసింగ్, భూక్యా మల్సూర్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రజా పంపిణీ బియ్యం పట్టివేత

నూతనకల్ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని బిక్కుమళ్ల శివారులోని 365 జాతీయ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల ప్రజాపంపిణీ బియ్యాన్ని పట్టుకొని వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై మహేంద్రనాథ్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడకు చెందిన బుద్ధ శ్రీనివాస్ తక్కువ ధరకు పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి అధిక ధరకు అమ్మేందుకు వెళ్తుండగా పట్టుకుని బొలేరో వాహనాన్ని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. వాహన డ్రైవర్ దరావత్ సురేష్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు వివరించారు.

బస్సు పునరుద్ధరించాలని ధర్నా

నూతనకల్ గ్రామీణం, న్యూస్‌టుడే: తమ గ్రామం నుంచి హైదరాబాద్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సును పునరుద్ధరించాలంటూ ఎర్రపహాడ్ గ్రామస్థులు మంగ


జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న ఎర్రపహాడ్ గ్రామస్థులు

ళవారం రాత్రి ఎర్రపహాడ్ సమీపంలో 365 జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. చందుపట్ల, ముకుందాపురం, జీ.కొత్తపల్లి, మామిండ్లమడవ, రాంపూర్ గ్రామస్థులు బస్సు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పోలీసులు డిపో మేనేజర్‌కు సమస్యను వివరించి బస్సు వచ్చేలా చూస్తామని చెప్పడంతో గ్రామస్థులు ధర్నా విరమించారు.

ముగిసిన స్వచ్ఛతా హీ సేవా

20 రోజులపాటు పారిశుద్ధ్య పనులు


స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలలో భాగంగా సూర్యాపేటలోని వైద్యకళాశాల విద్యార్థుల మానవహారం

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే: పురపాలికల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు ముగిశాయి. ఇవి సెప్టెంబర్ 17న ప్రారంభం కాగా గాంధీ జయంతి రోజున బుధవారంతో ముగిశాయి. పుర అధికారులు ఇరవై రోజులపాటు కార్యక్రమాలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం పురపాలికల్లో స్వచ్ఛతపై ఏటా కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటోంది. స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇస్తూ పురపాలికలను ప్రోత్సహిస్తోంది.

విజయవంతంగా చేపట్టాం

–శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను సిబ్బంది సహకారంతో విజయవంతంగా చేపట్టాం. ఇరవై రోజులపాటు రోజుకో కార్యక్రమాన్ని ఎంచుకొని నిర్వహించటం అభినందనీయం. ప్రతి ఒక్కరూ స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇవ్వాలి.

రోజువారీగా చేపట్టిన కార్యక్రమాలు

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఉమ్మడి జిల్లాలోని 19 పురపాలికల్లో మరుగుదొడ్లను శుభ్రం చేయటం, కళాశాలల్లో విద్యార్థుల చేత స్వచ్ఛత ప్రతిజ్ఞ, పుర వాహనాలను శుభ్రం చేయడం, వార్డుల్లో డోర్ టు డోర్ సెగ్రిగేషన్‌పై అవగాహన కల్పించటం, ప్రధాన పట్టణాల్లో విద్యార్థుల చేత ప్రాంతాలను గుర్తించి శుభ్రం చేయడం, మొక్కలు నాటడం, ఎన్‌జీవోల చేత ప్లాస్టిక్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, ప్రతి వార్డుల్లో ఆర్‌ఆర్‌ఆర్(రెడ్యూస్ రియాజ్ రీసైక్లింగ్) శిబిరాలు నిర్వహించడం, ఎన్ఎస్ఎస్ విద్యార్థుల పరిశుభ్ర కార్యక్రమాలు, పాఠశాల విద్యార్థులతో ఎస్‌టీపీ, ఎఫ్ఎస్‌టీపీ ప్లాంట్లను సందర్శించడం, డంపింగ్‌యార్డులో ఎరువు తయారీ విధానంపై అవగాహన కల్పించటం, కళాశాల విద్యార్థులతో మానవహారం ఏర్పడటం, వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

సన్మానించి.. పురస్కారాలు అందించి

స్వచ్ఛత కార్యక్రమాల్లో పాల్గొన్న పారిశుద్ధ్య కార్మికులను ముగింపు సందర్భంగా పలు


సన్మానం, పురస్కారాలు పొందిన పారిశుద్ధ్య కార్మికులు

వురిని సన్మానించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 19 పురపాలికల్లో చివరి రోజు సమావేశాలు నిర్వహించి పురస్కారాలు ప్రదానం చేశారు. స్వచ్ఛతలో ముందుంటున్న వారిని ప్రోత్సహించేలా కేంద్రం ఇలాంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది.

పరిసరాల పరిశుభ్రతే గాంధీకి ఇచ్చే నివాళి: న్యాయమూర్తి శ్రీవాణి


కోర్టుల ప్రాంగణాన్ని శుభ్రపరిచిన న్యాయమూర్తులు

సూర్యాపేట న్యాయవిభాగం, న్యూస్‌టుడే: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటమే మనం గాంధీకి ఇచ్చే అసలైన నివాళి అని సూర్యాపేట జిల్లా న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 'స్వచ్ఛ భారత్ దివస్' నిర్వహించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు కోర్టుల సిబ్బంది కోర్టుల ప్రాంగణంలో చెత్త, పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రపరిచారు. జూనియర్ సివిల్ జడ్జిలు కె.సురేశ్, జె.ప్రశాంతి, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నూకల సుదర్శన్ రెడ్డి, డి.మల్లయ్య, ఇతర న్యాయవాదులు, కోర్టుల సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల వివరాలు నమోదు

మద్దిరాల గ్రామీణం, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వం ప్రవేశపెట్టిన తెలంగాణ కుటుంబ స్మార్ట్ కార్డు జారీ చేసేందుకు మండలంలోని రామచంద్రపురం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసినట్లు తహసీల్దార్ అమీన్‌సింగ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 3 నుంచి 7వరకు గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.


కోటపహాడ్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


సూర్యాపేటలో..


చివ్వెంలలో..

పూలవనమా..చూడతరమా..!


44వ వార్డులో..


నూతనకల్‌లో వర్షంలో ..


కొత్తగూడెంలో..

బతుకమ్మ ఉత్సవాలు జిల్లాలో వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి మహిళలు పెద్దఎత్తున బతుకమ్మ చౌరస్తా వద్దకు చేరుకున్నారు. బతుకమ్మలను ఒక దగ్గరికి చేర్చి పూజలను నిర్వహించారు. అనంతరం పాటలు పాడుతూ నృత్యాలను చేస్తూ సందడిగా గడిపారు. అనంతరం సద్దుల చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేసి ఒకరికొకరు వాయినాలు ఇచ్చుకున్నారు. అంతకుముందు సాయంత్రం 5గంటల ప్రాంగణంలో పేటలో భారీ వర్షం పడటంతో ఉత్సవాలకు ఇబ్బందులు కలుగుతాయని మహిళలు కొంత నిరుత్సాహానికి గురయ్యారు. వరుణ దేవుడు కరుణించడంతో వేడుకను కనుపండువగా జరుపుకున్నారు. పట్టణంలోని ఆయా వాడల్లో బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించగా మహిళలు ఆడిపాడారు. సూర్యాపేట సాంస్కృతికం, న్యూస్‌టుడే:


సూర్యాపేట సద్దుల చెరువులో బతుకమ్మను వదులుతున్న ఎమ్మెల్యే సతీమణి గుంటకండ్ల సునీత, పురపాలిక చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ


పాతర్లపహాడ్‌లో..


సూర్యాపేటలో..


నూతనకల్‌లో చైర్‌పర్సన్ జయసుధ


ఆత్మకూర్(యస్)లో..

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని ఎస్.వి.ఎన్ కాలనీలో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. మురుగు కాల్వలు లేకపోవడంతో ఖాళీ స్థలాల్లో నీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయి. రాత్రి కునుకు లేకుండా ఉంటుంది. –రాజు, ఎస్.వి.ఎన్.కాలనీ

✔ దోమల మందు పిచికారీ చేయిస్తాం.
–సురేశ్, పుర హెల్త్ అసిస్టెంట్, సూర్యాపేట

భానుపురి, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని తెలంగాణ తల్లి విగ్రహం చౌరస్తా వద్ద విద్యుత్తు నియంత్రిక రక్షణ గోడ కూలిపోయింది. రహదారి పక్కనే ఉండటతో ప్రమాదకరంగా మారింది. వెంటనే రక్షణ గోడ నిర్మించాలి.–రాజేష్, సూర్యాపేట

✔ రక్షణ గోడ నిర్మించి ఇబ్బందులు లేకుండా చూస్తాం.
–శ్రీనివాస్, డిస్కం డీఈ, సూర్యాపేట

చెట్టు విరిగి
మోడు బారిపోతుందని..

నూతనకల్, న్యూస్‌టుడే: సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలంలో అటవీ అధికారులు 18 ఏళ్ల క్రితం నూతనకల్-యడవెల్లి రోడ్డువెంట ఇరువైపులా బుర్రతంగేడు చెట్లు నాటించి సంరక్షించారు. నూతనకల్, యడవెల్లి, తాళ్లసింగారం గ్రామానికి చెందిన యువకులు



ఏటా బతుకమ్మ కోసమని రోడ్డువెంట ఉన్న బుర్రతంగేడు చెట్లను ఎక్కి కొమ్మలు విరిసి పువ్వులను తెంచుకొని వెళ్తుంటారు. కొమ్మలు విరవడంతో కొన్నిచెట్లు మోడు బారిపోయాయి. ఈసారి చెట్ల కొమ్మలు విరవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని యడవెల్లి గ్రామానికి చెందిన పొక్లెయిన్ యజమాని బొడ్డు అంజి ముందుకు వచ్చాడు. తన పొక్లెయిన్‌ను తంగేడు చెట్ల వద్ద అందుబాటులో ఉంచి యువకులు దానిని ఎక్కి తంగేడు పువ్వులు తెంచుకునేలా సహకరించాడు. చెట్లుఎక్కి కిందపడకుండా సహాయ పడటంతో పాటు చెట్ల కొమ్మలు విరగకుండా చెట్ల ఉనికిని కాపాడుతున్న అంజిని పలువురు అభినందించారు.

సద్దుల చెరువు.. పర్యవేక్షణ కరవు

భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేటలోని సద్దుల చెరువు వద్ద పర్యవేక్షణ లోపించింది. కట్టపై ఏర్పాటు చేసిన విగ్రహాలు విరిగిపోతున్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు విరగొట్టారా.. లేక నాణ్యత లేదా అనేది అంతుచిక్కడం లేదు. అధికారులు నిఘా లోపించడంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని పలువురు వాపోతున్నారు.

ఇదీ పరిస్థితి

సూర్యాపేట పట్టణంలోని సద్దుల చెరువును ట్యాంకు బండ్‌గా మార్చిన తర్వాత జన సందడి ఎక్కువైంది. ఉదయం, సాయంత్రం నడకదారులతో పాటు, పర్యాటకులు నిత్యం వస్తుంటారు. వీరి ఆహ్లాదం కోసం పుర




సూర్యాపేటలోని సద్దుల చెరువు కట్టపై ఇటీవల విరిగిపడిన విగ్రహాలు

అధికారులు గతేడాది సద్దుల చెరువు కట్టపై వివిధ రకాల విగ్రహాలు ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణ కొరవడటంతో అధ్వానంగా మారుతున్నాయి. ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాల్సిన అధికారులు తమకేమిపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రూ.లక్షలతో ఏర్పాటు చేసిన విగ్రహాలు విరగడంతో ప్రజాధనం వృథా అవుతుందని పలువురు వాపోతున్నారు.

వెలగని వీధి దీపాలు


వెలగని వీధి దీపం

చెరువు కట్టపై పలుచోట్ల వీధి దీపాలు వెలగటం లేదు. ట్యాంకుబండ్ నిర్మాణంలో భాగంగా కట్టపై విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేశారు. ఇవి వెలగకపోవడంతో అంధకారం నెలకొని నడకదారులతో పాటు పర్యాటకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పర్యవేక్షణ చేపడతాం

–శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట

సద్దుల చెరువు కట్టంపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపడతాం. విగ్రహాలు విరిగిపోకుండా చర్యలు తీసుకుంటాం. వీధి దీపాలు ఎక్కడ మరమ్మతులు గురయ్యాయో గుర్తించి చర్యలు చేపడతాం.

గాంధీజీ సేవలు చిరస్మరణీయం


సూర్యాపేటలోని పుర కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, కమిషనర్ శ్రీనివాస్, తదితరులు

మద్దిరాల, న్యూస్‌టుడే: మండలంలోని పోలుమళ్లలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎంపీడీవో మారుతి సత్యనారాయణరెడ్డి, మహేష్, మమత పాల్గొన్నారు. చందుపట్లలో భాజపా ఎస్సీమోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగూరి రమేష్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

తుంగతుర్తి గ్రామీణం: మండలంలోని బండరామారం, వెంపటి, గొట్టిపర్తి గ్రామాలలో గాంధీజీ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. భారాస మండల అధ్యక్షుడు సీతయ్య, వెంకన్న, మల్లేష్, యాకయ్య పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: మహాత్మా గాంధీ జయంతి వేడుకలను మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో, వివిధ గ్రామాల్లోని గ్రామ పంచాయతీల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి అధికారులు, సిబ్బంది నివాళి అర్పించారు. తహసీల్దారు లాలు, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఎస్సై రవీందర్, ఎంపీవో సంజీవయ్య, ఏపీవో రవి, ఏపీఎం అజయ్ నాయక్, ఈసీ మహేష్ పాల్గొన్నారు.

జాజిరెడ్డిగూడెం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పవన్‌కుమార్ గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

నూతనకల్: నూతనకల్ మండలపరిషత్, తహసీల్ కార్యాలయాల్లో బుధవారం గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. నాయబ్ తహసీల్దార్ వంశీకృష్ణ, సూపరింటెండెంట్ రామకృష్ణ, ప్రసాద్, మల్లయ్య పాల్గొన్నారు.


సూర్యాపేటలో భాజపా నాయకులు

భానుపురి: పట్టణంలో బుధవారం గాంధీజయంతి నిర్వహించారు. వివిధ ప్రభుత్వ కార్యాయాలు, పార్టీ కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పుర కార్యాలయంలో చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, కమిషనర్ శ్రీనివాస్ గాంధీ చిత్రపటానికి నివాళి అర్పించారు.

సూర్యాపేట నేరవిభాగం: సూర్యాపేటలోని జిల్లా పోలీసు కార్యాలయంలో గాంధీ జయంతి నిర్వహించారు. సిబ్బంది గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, ఏఆర్ అదనపు ఎస్పీ జనార్దన్‌రెడ్డి, ఏఆర్‌డీఎస్పీ నర్సింహచారి, ఆర్‌ఐలు నారాయణ రాజు, నర్సింహ, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ పాండరి పాల్గొన్నారు.


సూర్యాపేట : మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న, నాయకులు


పెన్‌పహాడ్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో..


తుంగతుర్తిలో..


నాగారం పోలీస్‌స్టేషన్‌లో..

పగలు ఎండ.. సాయంత్రం వర్షం


సూర్యాపేట పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద వర్షం కురవడంతో చల్లబడిన వాతావరణం

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే: సూర్యాపేట పట్టణంలో పగలంతా ఎండవేడిమితో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీంతో పాటు ఉక్కపోతతో చెమటలు వచ్చి నరకయాతన అనుభవించారు. రెండ్రోజులుగా ఎండలు పట్టణ ప్రజలను ఇబ్బందులకు గురిచేశాయి. బుధవారం సాయంత్రం 4.30 గంటలకు ఒక్కసారిగా వర్షం కురవటంతో వాతావరణం చల్లబడింది. మధ్యాహ్నం భానుడి ప్రతాపంతో బయటకు వెళ్లలేని దుస్థితి నెలకొంది. గంటపాటు కురిసిన వర్షానికి ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో పట్టణ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

నిలిచిన విద్యుత్తు సరఫరా

సూర్యాపేట పట్టణంలో ఈదురుగాలు, ఉరుములతో కూడిన వర్షం కురవటంతో విద్యుత్తు శాఖ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. వర్షం కురిసిన సమయంలో 30 నిమిషాలు సరఫరాను నిలిపివేశారు. గాలికి ఏమైనా తీగలు, విద్యుత్తు స్తంభాలు విరిగిపడి అవకాశం ఉండటంతో చర్యలు చేపట్టినట్లు విద్యుత్తు అధికారులు తెలిపారు.

ఇళ్లలోనే ప్రజలు

రెండ్రోజులుగా సూర్యప్రతాపం కారణంగా పట్టణ ప్రజలు ఎవరూ బయటకు రావడం లేదు. మధ్యాహ్న సమయంలో బయటకు రావాలంటేనే భయపడ్డారు. కొంతమంది ఎండ వేడిమిని తట్టుకోలేక కొబ్బర బోండాలు, తదితర రకాల పానీయాలతో ఉపశమనం పొందారు. ఎండ కారణంగా ఎక్కడ రహదారులపై జన సందడి అంతగా కనిపించలేదు. దీంతో పట్టణ ప్రజలు ఇళ్లలో ఉండి ఉపశమనం పొందారు. సూర్యాపేట పట్టణానికి వివిధ పనుల నిమిత్తం వచ్చిన వారు ఎండ వేడిమి తట్టుకోలేక చెట్ల నీడన ఉన్నారు. సాయంత్రం చల్లబడిన తర్వాత తమ ఇళ్లకు చేరుకున్నారు.